# సాక్షి
# వికారాబాద్

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025







**చేపపిల్లల పంపిణీపై..**

జల వనరులు నిండుకుండలా ఉన్నా ప్రభుత్వం ఇప్పటివరకు చేప పిల్లలను పంపిణీ చేయలేదు. 10లో▸



**అధికారిక లాంఛనాలతో..**

దోమ మండలం బడెంపల్లికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ తిరుపతి(48) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. 10లో▸




**రాజీయే రాజమార్గం**

చిన్న, చిన్న తగాదాలు, ఆర్థిక లావాదేవీలు తదితర కేసులను పరిష్కరించుకోవటానికి లోక్ అదాలత్ ఉత్తమం. 11లో▸

## న్యూస్‌రీల్

### అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఈఎంఆర్‌ఐ హెచ్‌ఆర్ హెడ్ కిరణ్ కిషోర్

**కొడంగల్ రూరల్:** 108 అంబులెన్స్, 102 అమ్మ ఒడి, 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లను గురువారం ఈఎంఆర్‌ఐ రాష్ట్ర హెచ్ ఆర్ హెడ్ కిరణ్ కిషోర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత అంబులెన్స్‌లలో రికార్డులను, మందులను, పరికరాలను, వాటి పని తీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌ల్లో ప్రాథమిక చికిత్స నిర్వహించేందుకు తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పైలట్లు, ఈఎంటీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద సంఘటనలకు వెంటనే స్పందిస్తూ బాధితులకు తక్షణ సేవలు అందించేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఈఎంఈ అబ్దుల్ రహీమ్, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### 'పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నాగేందర్‌గౌడ్'



అమరవీరుల స్తూపానికి నివాళి అర్పిస్తున్న రాజేందర్‌గౌడ్ తదితరులు

**అనంతగిరి:** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, విద్య, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ బరిలో ఉంటారని ఆయన కుమారుడు, రాష్ట్ర యువ నాయకుడు రాజేందర్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పార్టీ నాయకులతో కలిసి వికారాబాద్‌లోని అమరువీరుల స్తూపానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నేటి నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఏడాదిన్నర కాలం ప్రతీ పట్టభద్రుడిని కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం తీసుకుంటున్నామన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాగేందర్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాములు, వెంకటేశ్, వెంకటేశ్‌గౌడ్, చందు, మహేందర్, శ్రీశైలం యాదవ్, మల్లేశం, నర్సింలు యాదవ్, విజయ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### హైరానా వద్దు.. అది హైనా

**షాద్‌నగర్:** పట్టణంలోని శ్రీ బాలాజీ టౌన్ షిప్, సిరిసంపద వెంచర్ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించిందనే పుకార్లతో గురువారం స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు రవీందర్, అబ్దుల్ అజీజ్, బీట్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎల్కిచర్ల ఫారెస్టు అధికారి రవీందర్‌రెడ్డి, ఆమనగల్లు ఫారెస్టు అధికారి రాఘవేందర్ బాలాజీటౌన్‌షిప్, సిరిసంపద వెంచర్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో జంతువుల, అడవి పిల్లుల పాదాల జాడలను పరిశీలించారు. హైనాకు సంబంధించిన పాదాలుగా నిర్ధారించారు. భయపడాల్సిన పనిలేదని, చిరుత సంచరించిన జాడ ఎక్కడా కనిపించలేదని తెలిపారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# 'సాదా'కు సై!

భూ కొనుగోలు ఒప్పందాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 4,443 సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైంది. భూ భారతి చట్టం ప్రకారం ఈ ప్రక్రియ పరిశీలన బాధ్యతలను ఆర్డీఓలకు అప్పగించారు.

**సాదాబైనామా దరఖాస్తులకు లైన్ క్లియర్**

- క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నోటిఫికేషన్‌పై హర్షం
- జిల్లా వ్యాప్తంగా 11,718 అర్జీలు



**వికారాబాద్:** సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి సర్కార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లకు మోక్షం లభించనుంది. 2020 అక్టోబర్ 12వ తేదీ నుంచి నవంబర్ 10 తేదీ వరకు నెల రోజుల పాటు అప్పటి ప్రభుత్వం రైతులనుంచి అర్జీలు స్వీకరించింది. గతంలో ఇచ్చిన వారే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లోనూ అర్జీలు సమర్పించారు. సాదాబైనామాలకు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్ ఉండటంతో క్లియరెన్స్‌కు నోచుకోలేదు. ఇటీవల కోర్టు వీటి పరిష్కారానికి అనుమతించడంతో పక్రియ ముందుకు సాగనుంది.

**ఆప్షన్‌లేక డీలా**

రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు తీవ్రంగా శ్రమిస్తూ వస్తున్నప్పటికీ ఇంకా అనేకం మిగిలిపోయాయి. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతోంది. కోర్టు పరిధిలోని వివాదాలు, వ్యాజ్యాలు మినహా భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటికీ ఆగ స్టు 14 వరకు పరిష్కారం చూపుతామని ప్రభుత్వం పేర్కొనగా వచ్చిన వాటిలో పది శాతం కూడా పరిష్కరించలేకపోయారు. ఎన్నో సమస్యలపై అధికారులకు ఆప్షన్ లేకపోవడం కసరత్తుకు అడ్డంకిగా మారింది. 11,718 అర్జీలు వచ్చినా ఇందులో చాలా వరకు డబుల్ ఉన్నాయి. గతంలో మీ సేవ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్నవారే తిరిగి రెవెన్యూ సదస్సుల్లోనూ ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. ఇందులో సాదాబైనామాలు పరిష్కరించేందుకు సైతం ఇన్నాళ్లు ఆప్షన్ లేక పెండింగ్‌లో పడిపోయాయి.

**900 దరఖాస్తులకు పరిష్కారం**

పెండింగ్ దరఖాస్తుల్లో కోర్టు కేసులు, సర్వేతో ముడిపడిన అంశాలకు సంబంధించినవి, ప్రభుత్వ భూములకు సంబంధించినవే అధికంగానే ఉన్నాయి. జిల్లాలో మొత్తం 11,718 అర్జీలు పెండింగ్‌లో ఉండగా ఇందులో ఇప్పటికే 11,117 మంది రైతులకు అధికారులు నోటీసులు అందజేశారు. వచ్చిన వాటిలో గడిచిన రెండు నెలల్లో 900 దరఖాస్తులకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపారు. పెండింగ్‌లో ఉన్న 11 వేల పైచిలుకు దరఖాస్తులలో సాదాబైనామాకు సంబంధించినవే 4,443 ఉండడం గమనార్హం.

**పెండింగ్ అర్జీల వివరాలు**

| మండలం | దరఖాస్తుల సంఖ్య |
|---|---|
| మర్పల్లి | 211 |
| మోమిన్‌పేట్ | 298 |
| నవాబుపేట | 136 |
| వికారాబాద్ | 405 |
| పూడూరు | 136 |
| పరిగి | 223 |
| కుల్కచర్ల | 505 |
| దోమ | 417 |
| బొంరాస్‌పేట్ | 315 |
| ధారూరు | 203 |
| కోట్‌పల్లి | 139 |
| బంట్వారం | 81 |
| పెద్దేముల్ | 315 |
| తాండూరు | 246 |
| బషీరాబాద్ | 181 |
| యాలాల | 166 |
| కొడంగల్ | 151 |
| దౌల్తాబాద్ | 315 |
| మొత్తం | 4.443 |

**సమస్యలు పరిష్కరిస్తాం**



అందరి సహకారంతో సదస్సులు విజయవంతంగా పూర్తి చేశాం. ఈ రెవెన్యూ సదస్సుల నుంచి పదివేలకు పైగా అర్జీలు వచ్చాయి. ఇప్పటికే మ్యాన్యువల్‌గా పరిశీలన పూర్తి చేశాం. డేటా ఎంట్రీ దాదాపు పూర్తయింది. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు కోర్టు ఆదేశాలమేరకు పరిష్కరిస్తాం. ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి సాదాబైనామా సమస్యలు పరిష్కరిస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**చేవెళ్ల:** కేంద్రం ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, తంగడపల్లిలో రూ.9 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీలకు పైసా విడుదల చేయకుండా పాలనను అస్తవ్యస్తంగా మారుస్తోందని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు పదేళ్లుగా కేంద్రం అందించే నిధులే దిక్కవుతున్నాయని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. మరిన్ని నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, శర్వలింగం తదితరులు పాల్గొన్నారు.

## 'ఆహార భద్రత'ను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

- ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**అనంతగిరి:** ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని.. ఆహార భద్రత చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఆహార భద్రత చట్టం–2013 అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరై వివిధ శాఖల నివేదికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆహార భద్రత చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హక్కుదారులకు ఎలాంటి భంగం కలగకుండా న్యాయం చేకూర్చేలా కమిషన్ పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం తూకంలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. చౌక ధరల దుకాణాల వద్ద ఫిర్యాదుల పట్టిక, అధికారుల ఫోన్ నంబర్లను, పనిచేసే వేళలు ప్రదర్శించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీల్లో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని, మెనూ పట్టిక ప్రదర్శించాలన్నారు. విద్యా, నిఘా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. అంగన్వాడీలలో మాతా శిశువులకు పౌష్టిక ఆహారం కచ్చితంగా అందించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డీఆర్డీఏ శ్రీనివాస్, పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, డీఎంహెచ్‌ఓ లలితా దేవి, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ రేణుకాదేవి, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**అనంతగిరి:** లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్షను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన థియరీ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు, ప్లాటింగ్ ఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ఇందులో థియరీకి 76 మంది, ప్లాటింగ్‌కు 92 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎటువంటి కాపీయింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్ర పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని నియమించాలని డీఎంహెచ్‌ఓ లలితా దేవికి చెప్పారు. పరీక్ష కేంద్రం వద్దకు ఇతరులు ప్రవేశించకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామిరెడ్డి, డీహెచ్‌ఎస్‌ఓ సత్తార్, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సి.రాజు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: పెద్దేముల్ పీఏసీఎస్ వద్ద వర్షంలో గొడుగులు పట్టుకుని నిరీక్షిస్తున్న రైతులు

# యూరియా.. లేదే దయ!

రైతులు పంట సాగుకు కంటే వాటికి ఎరువులు తీసుకువచ్చేందుకు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా సరిపోక రోడ్లపై నిరసనలు, ఆఫీసుల ఎదుట ధర్నాలు చేపడుతున్నారు. ఎండ, వాన లెక్క చేయకుండా గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తెల్లవారుజామునుంచే ఆయా సరఫరా కేంద్రాలకు చేరుకుని చెప్పులు, కర్రలు, రాళ్ల క్యూలైన్లలో ఉంచుతున్నారు.

- గోదాముల వద్ద రైతుల ఇక్కట్లు
- గంటల తరబడి వేచిచూసినా ఒక్క రైతుకు ఒకటే బస్తా
- సరిపడా సరఫరా చేయాలని ఆందోళనలు

### సరిపడా సరఫరా చేయండి

**మోమిన్‌పేట:** యూరియా కోసం రైతు గోస పడుతూనే ఉన్నాడు. మోమిన్‌పేట, మేకవనంపల్లి పీఏసీఎస్‌లలో, వెల్‌చాల్ రైతు మిత్ర సంఘానికి అగ్రోస్ తదితర దుకాణాలకు యూరియా వస్తున్నా సరిపడా రావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే ఆయా కేంద్రాలకు చేరుకుని రాళ్లు, చెప్పులు, కర్రలు క్యూలో ఉంచి పక్కన పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుకు అవసరమైన మేర యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



మోమిన్‌పేట పీఏసీఎస్ వద్ద క్యూలో రాళ్లు, చెప్పులు ఉంచిన రైతులు

### పోలీసు పహారాలో..



మన్నెగూడ ఆగ్రోస్ వద్ద పోలీసు బందోబస్తు

**పూడూరు:** యూరియా కోసం రైతులు గురువారం మండల పరిధిలోని మన్నెగూడ, చన్గోముల్ మన గ్రోమార్ కేంద్రాల ఎదుట బారులు తీరారు. యూరియా బస్తాలు కోసం రైతులు ఎగబడటంతో సరఫరాలో గందరగోళం నెలకొంది. వ్యవసాయ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులను క్యూలైన్‌లలో ఉంచి ఎరువులను పంపిణీ చేశారు. చన్గోముల్ ఎస్‌ఐ భరత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి తులసీరాం దగ్గరుండి ఎరువుల పంపిణీ చేశారు.

### ఆగని ఆందోళన

**ధారూరు:** ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నుంచి పంపిణీ చేయాల్సిన యూరియాను గురువారం రైతు వేదిక వద్ద ప్రారంభించారు. ముందుగా టోకెన్లు తీసుకున్న రైతులు యూరియా తీసుకెళుతుంటే తర్వాత వచ్చిన వారు మాకెందుకు ఇవ్వరంటూ ఆందోళనకు దిగారు. ఎవరు ఎంతగా నచ్చజెప్పినా రైతుల ఆందోళన ఆగలేదు.

**నాగసమందర్‌లో లొల్లి**

నాగసమందర్ రైతు వేదికలో యూరియా ఇస్తున్న విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజామునే క్యూ కట్టారు. మధ్యాహ్నం అయినా అధికారులు రాకపోవడంతో రైతులు సిబ్బందిపై మండిపడ్డారు. ధారూరు నుంచి నాగసమందర్‌కు రావడానికి మధ్యలో ఉన్న రోడ్డుపై నుంచి ప్రాజెక్టు నీరు ప్రవహిస్తుందని ఏఈఓ, ధారూరు పీఏసీఎస్ సిబ్బంది చెప్పినా గొడుగులు పట్టుకుని సాయంత్రం వరకు వేచిచూసి ఇళ్లకు వెళ్లిపోయారు.



నాగసమందర్ రైతు వేదికలో రైతుల ఆందోళన

### అయ్యా.. యూరియా

- ఎస్‌ఐ కాళ్లు మొక్కిన రైతు
- సోషల్ మీడియాలో వైరల్

**కుల్కచర్ల:** నెల రోజులుగా యూరియా అందక ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే లేరని రైతులు ఆందోళన చేపట్టారు. గురువారం మండల కేంద్రంలో పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రైతులు కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీఎన్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వ్యవసాయాధికారులతో మాట్లాడారు. వారు శుక్రవారం రెండు లారీల యూరియా తెప్పిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఒక రైతు ఎస్‌ఐ రమేశ్ కాళ్లు మొక్కడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఎస్‌ఐ రమేశ్ కాళ్లు మొక్కుతున్న రైతు



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో రైతుల ఆందోళన

## పత్రికా స్వేచ్ఛను హరించడమే..

### సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

- ఏపీ పోలీసుల కేసులను ముక్తకంఠంతో ఖండన
- ఎడిటర్, పాత్రికేయులకు వెల్లువెత్తుతున్న సంఘీభావం




**సాక్షి, వికారాబాద్:** పత్రికా స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరును ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరు పత్రికల గొంతునొక్కడమేనని అభిప్రాయపడ్డారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి, బ్యూరో ఇన్‌ఛార్జి, రిపోర్టర్లపై ఏపీ ప్రభుత్వ ప్రోద్బలంతో అక్కడి పోలీసులు కేసులు పెట్టి ఆఫీసుకు వచ్చి నోటీసులు అందజేయడంపై వారు మండిపడ్డారు. పత్రికలో వచ్చిన కథనాలపై అభ్యంతరాలుంటే ఖండించడం, వివరణ ఇవ్వడం చేయాలి గానీ ఏకంగా కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

### వివరణ కోరాలి



పత్రికలో వచ్చే ప్రతీ విమర్శపై కేసు పెట్టాలనుకోవడం సరికాదు. ఆ వార్త విషయంలో వివరణ కోరాలి. కక్ష సాధింపు చర్యలకు పాల్పడకూడదు. అకారణంగా అరెస్టులు చేయకూడదు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ముఖ్యమైనది. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం, తప్పుడు కేసులు పెట్టడం అప్రజాస్వామికం.

– శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ)

### దాడులు అప్రజాస్వామికం



పత్రికలపై దాడులు అప్రజాస్వామికం. ప్రభుత్వాలు చేపట్టే పథకాలు, కార్యక్రమాలకు విస్తృత ప్రచారం చేసే మీడియా, ప్రజా సమస్యలపై అంతకంటే రెట్టింపు స్థాయిలో స్పందిస్తోంది. చట్టాలకు లోబడి కథనాలు రాస్తే దాడులు చేయడం శోచనీయం. ఎవరి పరువుకైనా భంగం వాటిల్లినట్లు భావిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించాలి. యూనియన్లు పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తే జర్నలిస్టులకు న్యాయం జరుగుతుంది.

– ఎస్.రవిశంకర్, సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే

### అవమానించడమే



కూటమి ప్రభుత్వం పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి, జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టినట్టు తెలుస్తోంది. ఎన్నికల హామీల అమలుపై, ప్రభుత్వ తప్పులను ప్రచురిస్తే కేసులు పెట్టడం సరికాదు. ప్రభుత్వంపై వస్తున్న వార్తలపై అభ్యంతరాలు ఉంటే నోటీసులు ఇవ్వాలి, ఖండించాలి. తప్పుడు కేసులు పెట్టిన పోలీసులు, అధికారులు సైతం చట్టం ముందు నిలబడాల్సి వస్తుంది. చట్టం ఎవ్వరికీ చుట్టం కాదు. పత్రిక స్వేచ్ఛకు భగం కలిగించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే.

– వెంకటయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

### సమాజం హర్షించదు



ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛ ముఖ్యమైంది. ఒకరు చెప్పిన వార్తను ప్రచురించినందుకుగాను సాక్షి ఎడిటర్‌పై కేసు పెట్టడం సమంజసం కాదు. మీడియా గొంతు నొక్కేయాలని చూడటం పత్రిక స్వేచ్ఛను హరించడమే. సమాజం కక్ష సాధింపు చర్యలను హర్షించదు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ఈ ఘటనలను యావత్ సమాజం గమనిస్తూనే ఉంది.

– రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

### సమంజసం కాదు



సమాజంలో ప్రజా సమస్యలను జర్నలిస్టులు పత్రికల ద్వారా ప్రభుత్వానికి చేరవేస్తారు. ప్రజలకు ప్రభుత్వానికి జర్నలిస్టులు వారధిగా ఉంటారు. సమాజం కోసం అహర్నిశలు పాటుపడే జర్నలిస్టులపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయడం సమంజసం కాదు. పత్రికల్లో పనికట్టుకుని వార్తలు రాస్తే తప్పు పట్టాలి. నాయకులు అన్న ప్రకటనలు రాస్తే కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించినట్లే.

– బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

## క్లుప్తంగా

### ఇరువర్గాల దాడిలో 33 మందిపై కేసు నమోదు

**తాండూరు రూరల్:** మండలంలోని చంద్రవంచ గ్రామంలో ఇటీవల అర్ధరాత్రి జరిగిన ఇరువర్గాల దాడిలో 33 మందిపై కేసులు నమోదు చేశామని తాండూరు రూరల్ సీఐ నగేశ్ గురువారం తెలిపారు. ఓ వర్గానికి చెందిన 15 మంది, మరో వర్గానికి చెందిన 18 మందిపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని చెప్పారు. వీరందరిని పట్టణంలోని కోర్టుకు తరలించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. గ్రామాల్లో అందరూ అన్నదమ్ముళ్ల మాదిరి కలిసి మెలసి ఉండాలని సూచించారు.

### బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

**యాచారం:** ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో యాచారం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో ఈ నెల 6న అర్ధరాత్రి ఓ బాలికను కిడ్నాప్ చేసి అదే గ్రామానికి చెందిన భాషమోని క్రాంతి, జి.క్రాంతిలు లైంగికదాడికి పాల్పడ్డారు. దీనిపై యాచారం పోలీసులు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

### భగీరథ సరఫరాలో అంతరాయం



హస్నాబాద్‌లో బోరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

**దుద్యాల్:** మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కారణంగా మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిపేయనున్నట్లు అధికారులు గురువారం పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, దుద్యాల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల వ్యాప్తంగా మిషన్ భగీరథ నీటి సరఫరాను గురువారం నుంచి శనివారం వరకు నిలిపివేడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రైవేట్ బోర్లను ఆశ్రయిస్తున్నారు. దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ గ్రామాల్లో 10 రోజుల నుంచి పరిశీలిస్తే ఒక్కరోజు మాత్రమే నీటి సరఫరా అయింది.

### ట్రిబుల్‌ఆర్ వద్దని నిరసన



ఆందోళన చేపట్టిన రైతులు

**అనంతగిరి:** ప్రభుత్వం చేపడుతున్న ట్రిబుల్ ఆర్ వద్దని నవాబుపేటకు చెందిన పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో అనుకున్న పాత అలైన్‌మెంట్ ప్రకారం భూములు సేకరించాలన్నారు. అంతేకానీ ప్రస్తుతం ఇచ్చిన అలైన్‌మెంట్‌తో చిన్నకారు రైతుల భూములు మొత్తం పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. భూములు కోల్పోతే తమ బతుకులు రోడ్డుపై పడుతాయన్నారు. బడా బాబుల పొలాలు కాకుండా పేద రైతుల పొలాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే పునరాలోచించి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

### బావిలో పడి వ్యక్తి దుర్మరణం

**మోమిన్‌పేట:** స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం మోమిన్‌పేటలో చోటుచేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఏన్కతల గ్రామానికి చెందిన మ్యాతరి రాములు(58) తన వ్యవసాయ బావి వద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. మిగిలిన కుటుంబ సభ్యులు పొలంలో పనులు చేస్తుండగా స్నానానికి వెళ్లిన వ్యక్తి ఎంతకీ తిరిగిరాకపోవడంతో బావి వద్దకు వెళ్లారు. అందులో పడిపోయిన రాములు శవమై కనిపించాడు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి

**కొందుర్గు:** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలోని వెంకిర్యాలలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మానాయక్‌తండాకు చెందిన రాములునాయక్(60) వెంకిర్యాలలో కూరగాయలు తెస్తానని మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం కనిపించలేదు. గురువారం ఉదయం వెంకిర్యాల శివారులోని తిమ్మారెడ్డి చెరువులో నీటిపై ఓ మృతదేహం తేలిందని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా రాముల్‌నాయక్‌గా గుర్తించారు. మృతుడి భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

# చేపపిల్లల పంపిణీపై నీలినీడలు

**అదును దాటుతున్నా పడని ముందడుగు**

- గతేడాది సైతం పంపిణీ చేయని ప్రభుత్వం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



లక్నాపూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు (ఫైల్)



చేప పిల్లలు

| జిల్లాలో చేపపిల్లల పంపిణీ లక్ష్యం 1.29 కోట్లు | |
|---|---|
| చెరువులు, కుంటలు: | 830 |
| రిజర్వాయర్లు: | 16 |
| మత్స్యకార సంఘాలు: | 133 |

**పరిగి:** భారీ వర్షాలతో ప్రస్తుతం చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. జిల్లాలోని అన్ని జల వనరులు నిండుకుండలా దర్శనమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయలేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వారికి ఆర్థిక తోడ్పాటునందించేందుకు ప్రవేశపెట్టిన మత్స్యపథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏటా ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి జూన్, జూలైలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా ఈ ఏడాది ఆ ఊసే లేదు. మత్స్యశాఖకు ప్రభుత్వం నిధులు కేటాయించినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. గతేడాది చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. ఒకవేళ పథకాన్ని కొనసాగించి చేప పిల్లలను ఆలస్యంగా చెరువులు, రిజర్వాయర్లలో వదిలితే వాటి ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని మదనపడుతున్నారు. మత్స్య పథకం 2017న ప్రారంభించి 2023 వరకు ఏడు విడతల్లో చేప పిల్లలు పంపిణీ చేశారు.

**నిధులు విడుదలైనా..**

మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నీటి వసతి కలిగిన చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు జులై మాసంలోనే ప్రణాళికను సిద్ధం చేసుకునేది. పిల్లల సరఫరాకు టెండర్ల ప్రక్రియపై రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సంపదకు నిధులను కేటాయించింది. కానీ ఇప్పటివరకు పంపిణీపై ఎలాంటి ముందగుడు పడలేదు. జిల్లా వ్యాప్తంగా 830 చెరువులు కుంటలు ఉండగా, 16 ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే 133 మత్స్యకార సంఘాలున్నాయి. చెరువులు, ప్రాజెక్టులకు కలిపి 1.29 కోట్ల చేపపిల్లలు వదిలేందుకు లక్ష్యాన్ని అధికారులు ఎంచుకున్నారు. రహూ, బొచ్చ, బంగారు తీగ వంటి చేప పిల్లలను వదలాల్సి ఉంటుంది. 35 ఎంఎం నుంచి 45ఎంఎం 1.04 కోట్లు, 80ఎంఎం నుంచి 100ఎంఎం చేప పిల్లలను 25లక్షల మొత్తం 1.29 కోట్ల చేప పిల్లలను జిల్లా వ్యాప్తంగా చెరువుల్లో వదలాల్సి ఉంది.

**ఆలస్యంతో ఎదగని పిల్లలు**

ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మత్స్యసంపదకు నిధులు కేటాయించారు. కానీ చేప పిల్లలను పంపిణీపై స్పష్టత లేదు. సకాలంలో పంపిణీ చేయకపోవడంతో చేపలు ఎదుగుదల లేక నష్టం వాటిల్లుతుందని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రభుత్వం గతేడాది చేప పిల్లలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి చేయకపోవడంతో మత్స్య సంపదను నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతేకాక ప్రైవేటులో ఇతర రాష్ట్రాల నుంచి చేప పిల్లలను తీసుకువచ్చి చేతులు కాల్చుకున్నారు. చెరువుల్లో మేత కుళ్లితే చేపల ఎదుగుదల క్షీణిస్తుందని మత్స్యకారులు దిగులు చెందుతున్నారు.

**పంపిణీ చేయాలి**

గతేడాది చేప పిల్లలను పంపిణీ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రైవేటులో చేప పిల్లల కొనుగోలు కోసం రూ.లక్షలు వెచ్చించాం. ప్రభుత్వమే చేప పిల్లలను పంపిణీ చేస్తే మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. వెంటనే పంపిణీ ప్రక్రియ చేపట్టాలి.

– రమేశ్, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు దాదాపూర్

**టెండర్లు పూర్తి**

చేప పిల్లల పంపిణీకి టెండర్లను ఆహ్వానించాం. ప్రక్రియ పూర్తి కాగానే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రెండు రోజుల్లో మొత్తం టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. త్వరలోనే చేప పిల్లలను పంపిణీ చేస్తాం. అక్టోబర్ మొదటి వారంలో చేప పిల్లల పంపిణీకి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

– వెంకన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి

# ఏడీఏ లేక.. సేవలు సాగక

- పశువైద్యాధికారి పోస్టు ఖాళీ
- కొడంగల్ ఏడీఏకు తాండూరు ఇన్‌చార్జి బాధ్యతలు



పశు వైద్యాధికారి కార్యాలయం



ఖాళీగా ఏడీఏ సీటు

**తాండూరు రూరల్:** పశువైద్యాధికారి లేక మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్యాధికారి కార్యాలయంలో ఏడీఏ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఏడీఏగా పని చేసిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొడంగల్ పశువైద్య కార్యాలయంలో పని చేస్తున్న ఏడీఏ డాక్టర్ నోవాకు తాండూరు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నాటి నుంచి ఇప్పటివరకు సదరు అధికారి కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయ సిబ్బంది మాత్రమే తాత్కాలికంగా పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇన్‌చార్జి ఏడీఏ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పశువుల కాపరులు మండిపడుతున్నారు. ముఖ్యంగా సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరులో ఉన్న రైతులు పశువుల చికిత్స చేసుకోవడానికి వస్తుంటారు. కానీ డాక్టర్ లేకపోవడంతో సిబ్బందితో చికిత్సలు చేస్తున్నారు.

**డిప్యూటేషన్ల పర్వం**

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్యాధికారి ఏడీఏ కార్యాలయంలో గొర్రెలు, మేకలు, ఎద్దులు, కుక్కలకు వైద్య సేవలు చేసేందుకు ధారూరు మండలం కుక్కింద పశువైద్యశాలలో పని చేస్తున్న ఫ్యారమేట్ సైదులును డిప్యూటేషన్‌పై తాండూరుకు వచ్చారు. ఆయన కూడా కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. వారానికి ఒకరోజు వచ్చి రిజిస్టార్‌లో సంతకాలు చేసి వెళ్లిపోతున్నాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఏడీఏ కార్యాలయంను పర్యవేక్షించి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జంక్ ఫుడ్ తిని రోగాల బారిన పడొద్దు



విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

**పూడూరు:** విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని కంకల్ ప్రాథమిక పాఠశాలలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాహారం తీసుకుంటే మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. జంక్ ఫుడ్ తీసుకోవడం ద్వారా శరీరానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మానవ శరీరానికి పోషకాహార ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మస్తాన్‌బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్**



మాట్లాడుతున్న ప్రణయ్ తదితరులు

**మహేశ్వరం:** మహేశ్వరం మోడల్ స్కూల్‌లో స్కావెంజర్ల జీతాల్లో అవినీతికి పాల్పడిన ప్రిన్సిపాల్ గోపిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద గతేడాది ఆగస్టు నుంచి నెలకు రూ.10 వేల చొప్పున మరుగుదొడ్లు శుభ్రం చేసేవారు(స్కావెంజర్ల) జీతాల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ప్రిన్సిపాల్ ఇద్దరి స్కావెంజర్లను నియమించి వారికి నెలకు రూ.10 వేల చొప్పున జీతం ఇవ్వకుండా, కేవలం రూ.7వేల ఇచ్చారని ఆరోపించారు. స్కావెంజర్ల జీతాలలో ప్రిన్సిపాల్ చేతివాతం ప్రదర్శించి అవినీతి చేయడం సరికాదన్నారు. వెంటనే ప్రిన్సిపాల్ గోపిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధు, తరుణ్, రాహుల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



తిరుపతి పార్థివదేహానికి గౌరవ వందనం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు

**అనారోగ్యంతో సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ తిరుపతి మృతి**



తిరుపతి (ఫైల్)

**దోమ:** మండల పరిధిలోని బడెంపల్లికి చెందిన సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) ఏఎస్ఐ కావలి తిరుపతి(48) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన అంత్యక్రియలను గురువారం స్వగ్రామంలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. 1997లో ఉద్యోగానికి ఎంపికైన తిరుపతి హకీంపేట సీఆర్‌పీఎఫ్‌లో తొలిసారి విధుల్లో చేరారు. అక్కడి నుంచి త్రిపుర, మణిపూర్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీలో పనిచేశారు. జమ్మూకాశ్మీర్ పనిచేస్తున్న ఆయన ఇటీవలే బదిలీపై హకీంపేటకు వచ్చారు. విధుల్లో భాగంగా వారం రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి, ఈనెల 7న హైదరాబాద్ తిరిగొచ్చాడు. తొడ భాగంలో ఏర్పడిన గడ్డతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో సోమవారం సిబ్బంది అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించి చనిపోయారు. మృతుడికి భార్య కావలి సరోజ, ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు రవికుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు వరుణ్ ఎంబీఏ చదువుతున్నాడు. తిరుపతి మృతి బాధాకరమని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి.నాయక్ అన్నారు. సిబ్బందితో కలిసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి, అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

## ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య



కొండల్‌రెడ్డి (ఫైల్)

**బంట్వారం:** బంట్వారం మండలానికి చెందిన ఓ ఐటీఐ విద్యార్థి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన నారెగూడెం భీంరెడ్డి, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకొడుకు కొండల్‌రెడ్డి (21) పార్ట్ టైం జాబ్ చేస్తూ నగరంలో ఐటీఐ చదువుతున్నాడు. కూకట్‌పల్లిలోని బంధువుల ఇంట్లో ఉంటున్న కొండల్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో తన గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పనులు ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్న బంధువులు ఇది గమనించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వగ్రామం సుల్తాన్‌పూర్‌లో కొండల్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా విద్యార్థి మృతికి కారణాలు తెలియరాలేదు.

## రోడ్లపై 'బైక్ స్టంట్లు'

**ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**రాజేంద్రనగర్:** ద్విచక్ర వాహనాలతో రోడ్లపై స్టంట్లు చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇద్దరు యువకులతో పాటు మరో మైనర్‌ను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకొని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన అహ్మద్ బిన్ ఫారూఖ్, అతని స్నేహితుడు మహ్మద్ ఆజంలు రెండు ద్విచక్ర వాహనాలపై మరో స్నేహితుడు మైనర్ బాలుడు (16)తో కలిసి గురువారం ఉదయం అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ వైపు ప్రయాణిస్తున్నారు. రెండు బైక్‌లపై స్టంట్లు చేస్తూ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపారు. దీంతో రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు వాహనదారులు తమ సెల్‌ఫోన్‌లో ఈ విన్యాసాలను చిత్రీకరించి సోషల్ మీడియాతోపాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు పంపిచారు. వాహనాల నంబర్ల ఆధారంగా ఇద్దరు యువకులతో పాటు మైనర్‌ను గుర్తించి పోలీసులు సాయంత్రం వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ముగ్గురిని తదుపరి విచారణ నిమిత్తం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజులు మాట్లాడుతూ..ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తే వారికి శిక్ష తప్పదన్నారు. మైనర్లకు వాహనాలు అందించిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

## అడవుల పరిరక్షణే ధ్యేయం

- జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్
- అమరులకు ఘన నివాళి



మాట్లాడుతున్న డీఎఫ్ఓ

**అనంతగిరి:** అడవుల పరిరక్షణే ధ్యేయమని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వికారాబాద్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ నర్సరీల్లో మిగిలిన మొక్కల నిర్వహణ, సంరక్షణ గురించి చర్చించారు. వర్షాలు కురుస్తున్నందునా అవెన్యూ ప్లాంటేషన్‌కి అనువైన ప్రాంతాలను గుర్తించి ప్లాంటేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ రేంజ్ ఆఫీసర్ కే. శ్యాంకుమార్, రాజేందర్, శ్రీదేవి సరస్వతి, పరిగి రేంజ్ ప్రతిమ, కొడంగల్ రేంజ్ ఆఫీసర్ సవిత, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురిసి.. జలాలు పెరిగి



అమ్డాపూర్ సమీపంలో ఈసీ వాగు ప్రవాహం

- నిండుకుండల్లా చెరువులు, కుంటలు
- పరిసరాల్లో వృద్ధి చెందిన భూగర్భ జలాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



నిండుకుండలా పటేల్‌కుంట

**మొయినాబాద్‌రూరల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాల నిల్వలు పెరిగాయని నిపుణులు, అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పంటల సాగుకు అవసరమైన నీటి వనరులు సమకూరాయని భావిస్తున్నారు. బోరు బావులు సైతం సమృద్ధిగా నీటిని పోస్తున్నాయి. ఎక్కడ బోరు వేసినా పైపైనే నీరు వచ్చే అవకాశం ఉందని తెలుపుతున్నారు.

**రికార్డుస్థాయిలో వర్షాలు**

సగటు వర్షపాతం 400 మిల్లీమీటర్లు కాగా ఆగస్టు చివరి నాటికి 612 మి.మీ నమోదయింది. చేవెళ్ల నియోజకవర్గంలో వర్షపాతం నమోదు ఇలా ఉన్నది. చేవెళ్ల మండలంలో 63 శాతం, మొయినాబాద్‌లో 53 శాతం, షాబాద్‌లో 83, శంకర్‌పల్లిలో 48 శాతం అధిక వర్షం కురిసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవలేదు. జూలై రెండోవారం వరకు అడపాదడపా మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. ఆగస్టు నెలలో సమృద్ధిగా వానలు పడదంతో అధిక వర్షపాతం నమోదైంది. రానున్న రబీ సీజన్‌కు నీటి కొరత ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

**పైపైకి గంగమ్మ**

వర్షాలు సమృద్ధిగా కురిసిన నేపథ్యంలో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు పైకి వచ్చేశాయి. గతంలో పాతాళానికి పడిపోయిన నీరు ప్రస్తుతం పైపైకి పాకుతుంది. ఆగస్టు నెలలోనే 4.31 మీటర్ల మేర అండర్ గ్రౌండ్ వాటర్ వృద్ధి చెందాయి. వేసవితో పోలిస్తే చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా మండలాలలో మొయినాబాద్‌లో 5.06, చేవెళ్లలో 7.98, షాబాద్‌లో 6, శంకర్‌పల్లిలో 4.08 మీటర్ల నీటి మట్టం పెరిగాయి.

**సమృద్ధిగా జలాలు**



ఆగస్టు నెలలో అధిక వర్షాలు కురియడంతో సమీప వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు సమృద్ధిగా పోస్తున్నాయి. ఈ సంవత్సరం పంటలకు నీటి కొరత ఉండదు.

–సైపాల్‌రెడ్డి, రైతు, అమ్డాపూర్

**పెరిగిన సాగు విస్తీర్ణం**



సమృద్ధిగా వర్షాలు కురవడంతో వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. బోరు బావుల్లో జలాలు పెరిగాయి. వాగులు, వంకలు అలుగు పారుతున్నాయి. పత్తి, కంది ఇతర కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– అనురాధ, ఏఓ, మొయినాబాద్

## నిల్వ ఉంచిన 34 సిలిండర్ల పట్టివేత



పట్టుబడిన సిలిండర్లు

**పహాడీషరీఫ్:** స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తున్న కేంద్రంపై మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడలోని కావ్య ప్లాస్టిక్, స్టీల్ హౌస్‌లో పోలోడు గోవర్ధన్, మామిడిపల్లికి చెందిన రాజు, కాటేదాన్‌కు చెందిన అనిల్‌లు అక్రమంగా సిలిండర్లను నిల్వచేసి అవసరమైన వారికి రెట్టింపు ధరలో విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, వారి వద్ద నుంచి వివిధ పరిమాణాలకు సంబంధించిన 34 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

## 108 సిబ్బందికి అవార్డులు

**మొయినాబాద్:** తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ఆల్ ఇండియా ప్రిసన్ డ్యూటీ మీట్‌లో ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బంది అవార్డులు అందుకున్నారు. నాలుగు రోజులపాటు జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిసన్ డ్యూటీ మీట్ 2025లో దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల్లో గాయపడినవారికి చికిత్స అందించడం, ఆసుపత్రికి తరలించడంలో మొయినాబాద్ 108 సిబ్బంది ఈఎంటీ భూక్య శ్రీకాంత్, పైలెట్ గవ్వల చంద్రశేఖర్ ఉత్తమ సేవలు అందించారు. వారి సేవలను గుర్తించిన ప్రిసన్ డీజీ సౌమ్యమిశ్ర గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో అవార్డులు అందజేసి అభినందించారు.